క్లుప్తంగా

15 శాతం ఐఆర్ ఇవ్వాలి

కామారెడ్డి అర్బన్: ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రకటించిన డీఏ సమంజసంగా లేదని, ఇది ఒక రకంగా అవమానించడమే అవుతుందని వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం(పేటా టీ ఎస్) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రంగా వెంకటేశ్వరగౌడ్, నోముల మధుసూదన్ రెడ్డిలు ఆరోపించారు. న్యాయంగా మూడు డీఏలు 15 శాతం ఐఆర్ ప్రకటించడం హేతుబద్ధంగా ఉంటుందన్నారు. సీఎం కేసీఆర్ వెంటనే దిద్దుబాటు చర్యలు తీసుకోవాలని కోరారు.

అధికారులు హాజరయ్యేలా చర్యలు తీసుకోండి



ఎల్లారెడ్డి: మండల సర్వసభ్య సమావేశాలకు డివిజన్ స్థాయి అధికారులు హాజరయ్యేలా తగిన చర్యలు తీసుకోవాలని ప్రజా ప్రతినిధులు సమావేశంలో కోరారు. మంగళవారం ఎంపీపీ మాధవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. సర్వసభ్య సమావేశానికి డివిజన్ స్థాయి అధికారులు హాజరు కాకపోవడంతో సమస్యలు పరిష్కారం కావడం లేదని వారు విన్నవించారు. అనంతరం పలువురు అధికారులు వారి నివేదికలను చదివి వినిపించారు. జెడ్పీటీసీ ఉషాగౌడ్, ఏఎంసీ చైర్మన్ కాశీ నారాయణ, ఎంపీడీవో లక్ష్మి, డీటీ సంగమేశ్వర్, ఎంపీవో ప్రకాష్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

తేలని మొక్కల లెక్క



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మంగళవారం ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీవో సాయన్న ఆధ్వర్యంలో గ్రామాల వారీగా రికార్డులను పరిశీలించారు. మండలంలోని చాలా గ్రామాల్లో నాటిన మొక్కలకు, రికార్డుల్లో నమోదు చేసిన మొక్కలకు లెక్క దొరక లేదు. మస్టర్లలో పేర్లు, ఎంపీడీవో సంతకాలు లేకుండా డబ్బులు చెల్లించినట్లు గుర్తించారు. దీనికి బాధ్యులపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని డీఆర్‌డీవో పేర్కొన్నారు. ఆడిట్ రికార్డులను పరిశీలించారు. ఎంపీడీవో సాయన్న, ఎంపీపీ అనసూయ, తదితరులు పాల్గొన్నారు.

జీపీ రికార్డుల పరిశీలన

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): భిక్కనూర్‌లోని జీపీ రికార్డులను ఎంపీవో ప్రకాష్ మంగళవారం పరిశీలించారు. జీపీలో పచ్చదనం, పరిశుభ్రతను పాటించాలని అన్నారు. పంచాయతీ కార్యదర్శి స్వప్న తదితరులున్నారు.

సత్యాగ్రహ దీక్ష

భిక్కనూరు: తెలంగాణ విశ్వ విద్యాలయం సౌత్ క్యాంపస్‌లో కాంట్రాక్ట్ అధ్యాపకులు నిరవధిక సమ్మెలో భాగంగా మంగళవారం గాంధీ విగ్రహం ముందు కూర్చుని సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీ కాంట్రాక్ట్ టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు యాలాద్రి, సునీత, రమాదేవి, నర్సయ్య, నిరంజన్ శర్మ, సరిత, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

యువకుల నిరాహార దీక్ష



నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్‌ను రెవెన్యూ డివిజన్‌గా మార్చాలని కోరుతూ మంగళవారం జుక్కల్ యూత్ ఫోరం సభ్యులు నిరాహార దీక్ష చేపట్టారు. వెనుకబడిన ప్రాంతంగా ఉన్న జుక్కల్ మండలాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి పర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ నిరాహార దీక్ష చేశారు. దీక్షకు డీసీసీ ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్ మద్దతు తెలిపారు. సభ్యులు విఠల్, మారుతి, అర్మణ్, ప్రకాష్ తదితరులున్నారు.

బస్సుల్లేక ప్రయాణికులకు ఇక్కట్లు



కామారెడ్డి టౌన్: కామారెడ్డి ఆర్టీసీ డిపోలో మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు సరిపడా బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు ఇక్కట్లు పడ్డారు. నిజామాబాద్‌లో ప్రధానమంత్రి మోదీ సభ నేపథ్యంలో ఆర్టీసీ బస్సులు నిజామాబాద్‌కు వెళ్లడంతో కామారెడ్డి బస్టాండ్‌లో ప్రయాణికులు గంటల తరబడి వేచి చూసి ఇబ్బందులు పడ్డారు. ప్రైవేట్ వాహనాలు, ఆటోలలో ప్రయాణించారు.

అభివృద్ధిలో దూసుకెళ్తున్న తెలంగాణ

- ప్రజలకు నాణ్యమైన వైద్యం, మంచి పాలన అందించడమే లక్ష్యం
- ఎమ్మెల్యే హన్మంత్ సింధే



తిమ్మనగర్ వద్ద కాకివాగుపై హైలెవల్ బ్రిడ్జి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే హన్మంత్ సింధే

పిట్లం(జుక్కల్): సీఎం కేసీఆర్ హయాంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమంలో దూసుకెళ్తుందని, తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి గ్రామానికి నాణ్యమైన వైద్యసేవలు, మంచి పాలన అందించడమే లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే హన్మంత్ సింధే పేర్కొన్నారు. ఆయన మంగళవారం మండల కేంద్రంలో, మండలంలోని పలు గ్రామాలలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాన చేశారు. మన ఊరు- మన బడి పథకంలో నిర్మించిన పాఠశాల భవనాలతో పాటు పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వాసరి రమేష్, ఎంపీపీ కవిత, జెడ్పీటీసీ అరికెల శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ లక్ష్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తలవి చిల్లర వేషాలు

పిట్లం(జుక్కల్): బీఆర్ఎస్ చేస్తున్న అభివృద్ధి పనుల వల్ల సీఎంకు, బీఆర్ఎస్ పార్టీకి మంచి పేరు వస్తోందని, ఈ విషయం నచ్చక బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తలు చిల్లర వేషాలు వేస్తున్నారని ఎమ్మెల్యే హన్మంత్ సింధే విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మండల కేంద్రంలో మాట్లాడుతూ.. వర్షాకాలంలో ప్రజలను ఇబ్బందులను అర్థం చేసుకుని కాకివాగుపై రూ.3 కోట్ల 28 లక్షల నిధులతో హైలెవల్ బ్రిడ్జి మంజూరు చేయించానని, మంగళవారం బ్రిడ్జి పనులను ప్రారంభించేందుకు శిలాఫలకాన్ని ఏర్పాటు చేస్తే, ఇతర పార్టీల కార్యకర్తలు శిలాఫలకాన్ని ధ్వంసం చేయడం సిగ్గుచేటన్నారు. బీజేపీ నాయకురాలు అరుణతార, కాంగ్రెస్ నేత గంగారాం తమ కార్యకర్తలను అదుపులో పెట్టుకోవాలన్నారు.

దేహదారుఢ్యానికి క్రీడలు అవసరం

పిట్లం(జుక్కల్):యువకులు, క్రీడాకారులు తమ శరీర దేహదారుఢ్యాన్ని కాపాడుకునేందుకు క్రీడలు చాలా అవసరమని ఎమ్మెల్యే హన్మంత్ సింధే పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో జీపీలకు కేసీఆర్ క్రికెట్, వాలీబాల్, జిమ్, డిస్కత్రో పాటు 23 రకాల ఆట వస్తువుల కిట్లు, 75 స్పోర్ట్స్ టీషర్ట్‌లను పంపిణీ చేశారు.



క్రికెట్ కిట్‌లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

బీఆర్ఎస్‌లో చేరికలు

పెద్దకొడప్‌గల్(జుక్కల్): సీఎం కేసీఆర్ చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్ పార్టీలో చేరికలు మొదలవుతున్నాయని ఎమ్మెల్యే హన్మంత్ సింధే పేర్కొన్నారు. మంగళవారం పెద్ద దేవిసింగ్ తండా, సీతారాం డాకు చెందిన 20 మంది కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించారు. మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు తిర్మల్ రెడ్డి, సొసైటీ చైర్మన్ హన్మంత్ రెడ్డి, నాయకులు హన్రజ్, ఖండేరావు తదితరులు పాల్గొన్నారు.

మా గ్రామ సరిహద్దులు తేల్చండి



వినతిపత్రాన్ని అందజేస్తున్న జప్తిజాన్కంపల్లివాసులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): జప్తిజాన్కంపల్లి జీపీ సరిహద్దులను గుర్తించాలని కోరుతూ గ్రామస్తులు మంగళవారం స్థానిక ఎంపీడీవో రఘు, తహసీల్దార్ మహేందర్‌కుమార్, ఎంపీవో శ్రీనివాస్‌కు వినతి పత్రాలను అందజేశారు. తమ గ్రామ శివారులో మెల్లకుంటతండా గ్రామ పంచాయతీవారు పెత్తనం చేస్తున్నారని ఈ సందర్భంగా వారు ఆరోపించారు. తమ గ్రామంతో పాటు మెల్లకుంటతండా గ్రామానికి సంబంధించి సరిహద్దులను గుర్తించి ఇరుగ్రామాల మధ్య నెలకొన్న వివాదాన్ని సద్దుమణిగేలా చర్యలు చేపట్టాలని వారు అధికారులను కోరారు. సర్పంచ్ సాయిలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఈవీఎంలపై మహిళా సంఘ సభ్యులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

రాజంపేట: మండల కేంద్రంలోని కొండాపూర్‌లోని ఐకేపీ క్లస్టర్‌లో మంగళవారం తహసీల్దార్ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో మహిళా సంఘ సభ్యులకు ఈవీఎం ద్వారా ఓటు హక్కు ఎలా వినియోగించుకోవాలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు తమ ఓటును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ లింగాల స్వరూప, జెడ్పీటీసీ కొండ హన్మాండ్లు, సర్పంచ్ స్వాతి, కార్యదర్శి శ్రీజ, సీసీ భాగయ్య, వీవోఏలు పాల్గొన్నారు.

పదోన్నతులు కల్పించాకే బదిలీలు చేపట్టాలి



డీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న టీపీటీఎఫ్ నేత

కామారెడ్డి టౌన్: ఎస్జీటీలకు పదోన్నతులను కల్పించిన తర్వాతే బదిలీలు చేపట్టాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ మంగళవారం డీఈవో ఎస్.రాజుకు వినతిపత్రం అందజేశారు. ఎస్జీటీల బదిలీల సీనియారిటీల జాబితాలో తప్పులను సవరించాలని కోరారు. అర్హులైన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరారు. పదోన్నతులు ఇచ్చిన తర్వాతే ఎస్జీటీలకు బదిలీలు చేపట్టాలని నేడు ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు నిరసన ప్రదర్శన కార్యక్రమం ఉంటుందని ఉపాధ్యాయ సంఘాలు విజయవంతం చేయాలని కోరారు.

బదిలీలు చేస్తే ముట్టడిస్తాం

కామారెడ్డి టౌన్: ప్రమోషన్లు ఇవ్వకుండా బదిలీలు జరిపితే డీఎస్ఈ హైదరాబాద్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొంగల వెంకట్ హెచ్చరించారు.. మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

బాన్సువాడలో..

బాన్సువాడ రూరల్: ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించిన తర్వాతే బదిలీలు చేపట్టాలని టీపీటీఎఫ్ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఏశాల సత్యానారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం బాన్సువాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎదుట ఉపాధ్యాయులతో కలిసి నిరసన ప్రదర్శన నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వం పీఆర్సీ కమిటీ వేయడం హర్షణీయమైనప్పటికీ 5 శాతం ఐఆర్ ప్రకటించడం అన్యాయమన్నారు. 18 శాతం ఇవ్వాలని కోరారు.

మాచారెడ్డిలో..

మాచారెడ్డి: ఐఆర్ 5 శాతం ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ప్రకటించడం పట్ల ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఘన్‌పూర్ పాఠశాలలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.

ఆశావర్కర్లకు 'గడుగు' మద్దతు



నిజాంసాగర్(జుక్కల్): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నిరవధిక సమ్మె చేస్తున్న జుక్కల్ మండల ఆశావర్కర్లకు మంగళవారం డీసీసీ ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్ మద్దతు తెలిపారు. ఆశావర్కర్ల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు.

విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్ల పంపిణీ



బాన్సువాడ: బీర్కూర్‌లోని కేజీబీవీ, జిల్లా ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులకు ఎంపీపీ రఘు స్పోర్ట్స్ కిట్లను అందజేశారు. జెడ్పీటీసీ స్వరూప, మాజీ జెడ్పీటీసీ ద్రోణవల్లి సతీష్, ఎంపీడీవో భానుప్రకాష్ తదితరులున్నారు. అలాగే బైరాపూర్, బరంగేడ్గి, బీర్కూర్ గ్రామాల్లో మహిళలకు బతుకమ్మ చీరలను ఎంపీపీ రఘు పంపిణీ చేశారు.

సమాచారం..

ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు 13 వరకు గడువు పెంపు

కామారెడ్డి టౌన్: తెలంగాణ ఓపెన్ స్కూల్‌లో 10వ తరగతి, ఇంటర్మీడియట్ చదవడానికి 2023-24 విద్యాసంవత్సరానికి గాను ప్రవేశాలకు ఈనెల 13 వరకు గడువు పెంచినట్లు డీఈవో రాజు మంగళవారం తెలిపారు. అర్హులైన వారు స్థానిక మీ-సేవ కేంద్రాలలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

నేడు బతుకమ్మ చీరల పంపిణీ

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అన్ని జీపీల పరిధిలో బుధవారం బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమం చేపట్టాలని ఎంపీడీవో లక్ష్మి తెలిపారు. కార్యదర్శులు అందుబాటులో ఉండి పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

మద్నూర్‌లో ఎమ్మెల్యే సింధే పర్యటన

మద్నూర్(జుక్కల్): మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం జరిగే అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే హన్మంత్ సింధే హాజరుకానున్నట్లు బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. మండల కేంద్రంలో సెంట్రల్ లైటింగ్, జూనియర్ కళాశాల ప్రహరీతో పాటు పలు అభివృద్ధి పనులకు శంఖుస్థాపన చేయనున్నారని పార్టీ మండల అధ్యక్షుడు బస్సీ పటేల్ తెలిపారు.

రాజంపేటకు రానున్న ఎమ్మెల్యే జాజాల

రాజంపేట: రాజంపేట మండలంలోని ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని 12 గ్రామ పంచాయతీల పరిధిలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే జాజాల సురేందర్ విచ్చేస్తున్నట్లు మండల ఎంపీపీ లింగాల స్వరూప మంగళవారం తెలిపారు. ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్దెత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

పెంచిన వేతనాన్ని వెంటనే అమలు చేయాలి

మద్నూర్(జుక్కల్): మధ్యాహ్న భోజన కార్మికులకు గత సంవత్సరం రూ.3 వేల వేతనాన్ని చెల్లిస్తామన్న ప్రకటనను ప్రభుత్వం వెంటనే అమల్లోకి తీసుకురావాలని మధ్యాహ్న భోజన నిర్వాహకులు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్ కార్యాలయ ఆవరణలో మంగళవారం కార్మికుల సమ్మె కొనసాగింది. పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. సావిత్రి, సాయమ్మ, భూదేవి, గంగామణి, లక్ష్మి, సరిత తదితరులున్నారు.

ఎల్లారెడ్డిలో బోనాలతో నిరసన

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డిలో ఎండీఎం నిర్వాహకులు మంగళవారం బోనాలను ఎత్తుకుని నిరసన తెలిపారు. సాయిలు, దుర్గవ్వ తదితరులున్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు

నిజాంసాగర్(జుక్కల్): మల్లూర్ గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మంగళవారం బీఆర్ఎస్‌లో చేరారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులకు ఆకర్షితులై బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని అచ్చంపేట సొసైటీ చైర్మన్ నర్సింహారెడ్డి అన్నారు. నాయకులు దుర్గారెడ్డి, గైని విఠల్, మనోహర్, విఠల్‌రెడ్డి, బాబుసేట్, రామాగౌడ్ తదితరులున్నారు.

బీజేపీ, కాంగ్రెస్ దొందూ దొందే

ఎల్లారెడ్డి ఎమ్మెల్యే సురేందర్



నందివాడలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

తాడ్వాయి(ఎల్లారెడ్డి):బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు దొందూ దొందేనని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ విమర్శించారు. నియోజకవర్గంలోని గ్రామాలను అన్ని రంగాలలో అభివృద్ధి చేశానని ఆయన అన్నారు. మంగళవారం తాడ్వాయి మండలంలోని 14 గ్రామాలలో ఆయన పర్యటించి పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన నాటి నుంచి గ్రామాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలనే సంకల్పంతో నిధులు మంజూరు చేయిస్తూ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నానని తెలిపారు. ఒక్కో గ్రామానికి రూ.కోటికి పైగా నిధులను సమకూర్చినట్లు తెలిపారు. రెండు పార్టీల నాయకులు బాగా అబద్ధాలు ఆడుతూ కాలయాపన చేస్తున్నారని అన్నారు. గ్రామాలలో మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు మద్ది మహేందర్‌రెడ్డి, ఎంపీపీ కొడి రవి, జెడ్పీటీసీ రమాదేవి, మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిరెడ్డి, వైస్‌ఎంపీపీ నర్సింలు, డీసీఎంఎస్ డైరెక్టర్ కపిల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పల్లెల అభివృద్ధితోనే బంగారు తెలంగాణ

ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్

భిక్కనూరు : పల్లెలు బాగుంటేనే దేశం అభివృద్ధి చెందుతుందన్న ఉద్దేశంతో సీఎం కేసీఆర్ బంగారు పల్లెల్ని అభివృద్ధి చేస్తున్నారని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అన్నారు. మంగళవారం భిక్కనూరు మండల కేంద్రంలో జర్నలిస్టుల కాలనీకి శంకుస్థాపన చేశారు. అలాగే బస్వాపూర్, ఇసన్నపల్లి గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు నిర్వహించారు. ఈ సందర్భంగా గంప గోవర్ధన్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చడానికి ప్రజలందరూ మరొకసారి బీఆర్ఎస్‌కు పట్టం కట్టాలని కోరారు. కామారెడ్డి ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు సీఎం కేసీఆర్‌ను ఇక్కడి నుంచి పోటీ చేసేందుకు తాను ఆహ్వానించానన్నారు. ఎంపీపీ గాల్ రెడ్డి, జెడ్పీటీసీ పద్మనాగభూషణం గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, వైస్ చైర్మన్ రాజమౌళి, సర్పంచ్‌లు తునికి వేణు, మంజుల, రాములు, తదితరులు పాల్గొన్నారు.

'త్వరలో బసవేశ్వరుడి విగ్రహాన్ని ఆవిష్కరిస్తాం'



అన్నదానం చేస్తున్న ఎంపీ బీబీ పాటిల్

మద్నూర్(జుక్కల్): మద్నూర్‌లో అతి త్వరలో మహాత్మా బసవేశ్వర విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం చేపడతామని జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పాత బస్టాండ్‌లో కొనసాగుతున్న బసవేశ్వర విగ్రహ ఏర్పాటు పనులను మంగళవారం ఎంపీ పరిశీలించారు. విగ్రహ నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించి పనులు పూర్తి చేయాలని నిర్వాహకులకు ఆయన సూచించారు. అంతకు ముందు మండల కేంద్రంలో ఓంకార్ గణేష్ మండలి ఆధ్వర్యంలో చేపట్టిన అన్నదాన కార్యక్రమంలో ఎంపీ బీబీ పాటిల్ పాల్గొని పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు.

అగ్రికల్చర్ కళాశాలను అప్‌గ్రేడ్ చేయాలని వినతి

– టీఎస్ఎస్ఎఫ్ కన్వీనర్ పుట్ట భాస్కర్



మిర్జాపూర్‌లో మాట్లాడుతున్న పుట్ట భాస్కర్

నస్రుల్లాబాద్(బాన్సువాడ): రుద్రూర్ మండల కేంద్రంలోని అగ్రికల్చర్ కళాశాలను అప్‌గ్రేడ్ చేసేలా ఉమ్మడి జిల్లాలో ఉన్న ఎమ్మెల్యేలు కృషి చేయాలని టీఎస్ఎస్ఎఫ్ విద్యార్థి సంఘం జిల్లా కన్వీనర్ పుట్ట భాస్కర్ అన్నారు. మంగళవారం మిర్జాపూర్‌లో పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. నిజామాబాద్ జిల్లా రుద్రూర్ మండలం కేంద్రంలో ఉన్న అగ్రికల్చర్ కళాశాలను డిగ్రీ, పీజీకి అప్‌గ్రేడ్ చేసి నిరుపేద విద్యార్థులను ఆదుకోవాలన్నారు. అంతే కాకుండా కామారెడ్డి జిల్లాలో వెటర్నరీ కళాశాల ఏర్పాటు చేయాలన్నారు.

ఇందూర్ జనగర్జనకు తరలిన బీజేపీ శ్రేణులు



కామారెడ్డి పట్టణంలో జెండా ఊపి వాహనాలను పంపిస్తున్న బీజేపీ నేత వెంకట రమణారెడ్డి



సదాశివనగర్ నుంచి..

సాక్షి నెట్‌వర్క్:నిజామాబాద్ జిల్లా కేంద్రంలో మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రజాగర్జన సభకు బీజేపీ శ్రేణులు భారీగా తరలి వెళ్లాయి. బస్సులు, కార్లు, ఇతర వాహనాలల్లో ఎల్లారెడ్డి, కామారెడ్డి, జుక్కల్, బాన్సువాడ నియోజకవర్గాల నుంచి వేల సంఖ్యలో కార్యకర్తలు, నాయకులు బయలుదేరారు. నేతలు జెండా ఊపి వాహనాలను పంపించారు.



తాడ్వాయి నుంచి..



నాగిరెడ్డిపేట నుంచి..



భిక్కనూరు నుంచి..



కామారెడ్డి మండలం లింగాపూర్ నుంచి..



పెద్దకొడప్‌గల్ నుంచి..



మద్నూర్ నుంచి..

సంక్షిప్తం

చేప పిల్లల విడుదల

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గోపాల్‌పేట సమీపంలో గల జగ్గని చెరువులో మంగళవారం మత్స్యసహకార శాఖాధికారుల సమక్షంలో చేప పిల్లలను విడుదల చేశారు. నాగిరెడ్డిపేట ఎంపీపీ రాజ్‌దాస్ సమక్షంలో మత్స్యకారులు చేపపిల్లలను చెరువులో వదిలారు.

ఎస్సీ కమ్యూనిటీ హాల్ ప్రారంభం

ఎల్లారెడ్డి: పట్టణంలోని 1వ వార్డులో ఎస్సీ కమ్యూనిటీ భవనాన్ని మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ మంగళవారం ప్రారంభించారు. రూ.23 లక్షలతో నిర్మించిన ఎస్సీ కమ్యూనిటీ భవనాన్ని ఆయన ప్రారంభించారు. కౌన్సిలర్లు శ్రీనివాస్, సాయిలు తదితరులున్నారు.

ప్రభుత్వవిప్ గంప గోవర్ధన్‌కు కృతజ్ఞతలు

కామారెడ్డి క్రైం: కామారెడ్డిలోని అశోక్‌నగర్ యాదవ సంఘం సభ్యులు మంగళవారం ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్‌ను ఆయన నివాసంలో కలిశారు. తమ సంఘానికి రూ.10 లక్షలు మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

రూ.77.30 లక్షల నిధులు మంజూరు

కామారెడ్డి రూరల్: గర్గుల్ గ్రామంలో పలు అభివృద్ధి పనులకు ప్రభుత్వవిప్ గంప గోవర్ధన్ ప్రత్యేక చొరవ తీసుకుని రూ.77.30 లక్షలు నిధులు మంజూరు చేసినట్లు గ్రామ సర్పంచ్ రవితేజ గౌడ్ తెలిపారు. నిధులు మంజూరు చేసినందుకు ప్రభుత్వవిప్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

పోడు భూములకు పట్టాలివ్వాలి

మాచారెడ్డి: అర్హులైన వాళ్లందరికీ పట్టాలు ఇవ్వాలని రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు సూర నర్సన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మాచారెడ్డి తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. నాయకులు భూమయ్య బాప్ సింగ్, గంగయ్య, ఆలీ ఉన్నారు.

సీఐటీయూ నాయకుల ముందస్తు అరెస్టు

కామారెడ్డి టౌన్: నిజామాబాద్‌లో ప్రధాని మోదీ సభ నేపథ్యంలో ముందస్తుగా సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్‌ను పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. పోలీస్ స్టేషన్‌కు తరలించి సాయంత్రం విడుదల చేశారు.

నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలి

పిట్లం(జుక్కల్): గౌరారం, మద్దెలచెరువు గ్రామాలలో రూ.20 లక్షల ఈజీఎస్ నిధులతో నూతనంగా నిర్మిస్తున్న గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులను మంగళవారం ఎంపీవో బ్రహ్మం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని, త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

బీఆర్ఎస్‌కు బెస్త సంఘం మద్దతు

నిజాంసాగర్(జుక్కల్): రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓట్లు వేసి ఎమ్మెల్యే హన్మంత్ సింధేకు సంపూర్ణ మద్దతు ఇస్తామని బెస్త కులస్తులు ఏకగ్రీవంగా తీర్మానించారు. మంగళవారం నిజాంసాగర్ మండల పరిషత్ కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులకు బెస్త కులస్తులు ఏకగ్రీవ తీర్మాన పత్రాన్ని అందజేశారు. నాయకులు దుర్గారెడ్డి, గైని విఠల్, మనోహర్, విఠల్‌రెడ్డి, బాబుసేట్, బెస్త సంఘం నాయకులు ఉన్నారు.

ఉద్యోగాలు సాధించడమే లక్ష్యంగా పెట్టుకోవాలి

రామారెడ్డి (ఎల్లారెడ్డి): యువత ప్రభుత్వ ఉద్యోగాలను సాధించడమే లక్ష్యంగా పెట్టుకొని దానికి అనుగుణంగా ముందుకు సాగాలని రామారెడ్డి యూనిఫాం ఫోర్స్ సభ్యులు పిలుపునిచ్చారు. మంగళవారం సభ్యులు, రామారెడ్డి గ్రంథాలయానికి పది కుర్చీలను విరాళంగా ఇచ్చారు.